

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | ఆదివారం 06-09-2025 | సంపుటి : 07 | సంచిక : 117 | పేజీలు : 8 | వెల : రూ 3-00

# ట్రంప్ 'ఫ్రెండ్స్' కామెంట్స్‌పై స్పందించిన మోదీ.. ఎక్స్ వేదికగా రిప్లై



కొంతకాలంగా భారత్‌పై గుర్రుగా ఉన్న అమెరికా ప్రభుత్వం తీరులో స్పష్టమైన మార్పు మొదలైంది. మోదీ తనకెప్పటికీ స్నేహితుడే అంటూ అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా తమ స్నేహాన్ని గుర్తు చేసుకున్నారు. భారత్, అమెరికాలది ప్రత్యేకమైన బంధం అని కూడా కామెంట్ చేశారు. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ కూడా సానుకూలంగా స్పందించారు. ట్రంప్ వ్యాఖ్యలపై హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంలో తనదీ ఇదే భావన అని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. భారత్, అమెరికా మధ్య సమగ్ర అభివృద్ధికారక వ్యూహాత్మక భాగస్వామ్యం ఉందని అన్నారు భారత ఎగుమతులపై 50 శాతం సుంకం విధించిన అమెరికా ప్రభుత్వం ఆ తరువాత పలుమార్లు బహిరంగ విమర్శలకు దిగిన తెలిసిందే. ముఖ్యంగా ట్రంప్‌నకు సన్నిహితంగా ఉండే పలువురు నేతలు కూడా తమ నోటికి పని చెప్పారు. భారత్ మాత్రం హుందాగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కొన్ని సందర్భాల్లో వ్యూహాత్మక మౌనం పాటించింది. ఈ క్రమంలో ప్రధాని మోదీ చైనాలో జరిగిన షాంఘాయ్ సహకార సదస్సుకు హాజరయ్యారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కలివిడిగా మాట్లాడుతూ కనిపించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి. పాశ్చాత్య ఆధిపత్యాన్ని ధిక్కరించే ప్రత్యామ్నాయ కూటమి పురుడు పోసుకుంటోందన్న కామెంట్స్ వినిపించాయి. ఈ క్రమంలో ట్రంప్ మరోసారి స్పందిస్తూ సంచలన కామెంట్ చేశారు. భారత్, రష్యాలను అమెరికా చైనాకు కోల్పోయిందని అన్నారు. వారి భవిష్యత్తు చక్కగా ఉండాలని అభిలషిస్తున్నట్టు కామెంట్ చేశారు. ఆ తరువాత తన కామెంట్స్‌పై ట్రంప్ మరింత వివరణ ఇచ్చారు. తాము భారత్‌ను దూరం చేసుకున్నట్టు భావించట్లేదని అన్నారు. భారీ స్థాయిలో రష్యా చమురును భారత్ కొనుగోలు చేయడమే తనకు అసంతృప్తి కలిగించిందని, ఈ విషయాన్ని మాత్రమే చెప్పానని అన్నారు. ప్రధాని మోదీకి, తనకు మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. ఇక శుక్రవారం నాడు ఈ అంశంపై ట్రంప్ మరోసారి శ్వేత సౌధంలో మాట్లాడారు. మోదీ, తానూ ఎప్పటికీ స్నేహితులమేనని స్పష్టం చేశారు. మోదీ గొప్ప ప్రధాని అని ప్రశంసించారు. భారత్, అమెరికాల బంధం ప్రత్యేకమైనదని, ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేనేలేదని భరోసా ఇచ్చారు. భారత్, అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కూడా సానుకూల వాతావరణంలో జరుగుతున్నాయని చెప్పారు. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా సానుకూల కామెంట్స్ చేశారు. దీంతో, ఇరు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ గాడిన పడినట్టేనన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# యూఎస్ టారిఫ్స్ వేళ భారత్ కీలక నిర్ణయం..

## ఐరాస సమావేశాలకు ప్రధాని మోదీ దూరం

అమెరికా అధిక టారిఫ్‌ల వేళ భారత్ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెలాఖరులో అమెరికాలో జరగనున్న ఐక్యరాజ్యసమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరు కావాల్సి ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఈ సమావేశాలకు మోదీ హాజరు కావడం లేదని తెలిసింది. ఆయనకు బదులు విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఈ సమావేశాల్లో ప్రసంగించనున్నట్లు తాజా సమాచారం. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ఐక్యరాజ్యసమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. హై లెవల్ డిబేట్ మాత్రం సెప్టెంబర్ 23 నుంచి 29 వరకు జరగనున్నది. చర్చలో పాల్గొనే వక్తల జాబితాను తాజాగా యూఎన్ గత నెల రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. తొలుత బ్రెజిల్ చర్చను ప్రారంభిస్తుంది. ఆ తర్వాత అమెరికా మాట్లాడుతుంది. సెప్టెంబర్ 23వ తేదీన యూఎన్జీఏ పోడియం నుంచి డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ నేతలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సెప్టెంబర్ 26వ తేదీన ప్రధాని మోదీ ప్రసంగం ఉంటుందని ఆ జాబితాలో ఉంది. అదే రోజున



ఇజ్రాయిల్, చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ నేతలు కూడా ప్రసంగిస్తారు. ఈ సమావేశాలకు ప్రధాని యూఎస్ వెళ్తారని అంతా భావించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇరుదేశాల మధ్య నెలకొన్న వాణిజ్య సమస్యల పరిష్కారానికి ట్రంప్-మోదీ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి.

# ప్రకృతి వ్యవసాయం విస్తరణపై కలెక్టర్ దృష్టి

## పర్యావరణ పరిరక్షణకే ప్రకృతి సాగు కీలకం జిల్లా కలెక్టర్

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 06-జిల్లాలో ప్రకృతి వ్యవసాయం విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రాజకుమారి గణియా వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల్లో ప్రకృతి సాగు జరుగుతోందని, రానున్న రోజుల్లో దాన్ని లక్ష ఎకరాలకు పెంచేలా కృషి చేయాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక నాణ్యత ఉత్పత్తులు సాధ్యమవుతాయని, రైతుల ఆదాయం పెరగడమే కాకుండా భూసారం మెరుగవుతుందని



చెప్పారు. పొలం గట్లపై పంటలు వేసినప్పుడే ఎక్కువ లాభాలు వస్తాయని సూచించారు. మహిళా సంఘాల సమావేశాల్లో, అంగన్వాడీ కిచెన్ గార్డెన్స్‌లో ప్రకృతి సేద్యం ప్రాధాన్యం వివరించాలని అధికారులకు సూచించారు. గ్రామ, మండల స్థాయిలో ర్యాలీల ద్వారా రైతుల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి ఎంసి.మద్దిలేటి, హార్టికల్చర్ అధికారి నాగరాజు, డీఆర్డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, సెరికల్చర్ అధికారి నాగేష్, ఐసిడిఎస్ పీడీ లీలావతి దేవి తదితరులు పాల్గొన్నారు.

# జగన్ పాలనలో అన్ని రంగాలు దెబ్బతిన్నాయి..

అమరావతి: వైద్య రంగం నిధులను దోపిడి చేసి మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి తన ధన దాహాన్ని తీర్చుకున్నారని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా భ్రష్టుపడ్డ.. అనేక వ్యవస్థలను తిరిగి స్థాపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో తీవ్ర కృషి జరుగుతోందని తెలిపారు. గతంలో జగన్మోహన్ రెడ్డి అవినీతి దాహానికి బలి అయిపోయిన రంగాలను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని ధీమా వ్యక్తం చేశారు.




**వైద్యరంగం నిర్లక్ష్యం.** గత ప్రభుత్వం వల్ల రాష్ట్రంలో వైద్యశాఖ తీవ్రంగా దెబ్బతిన్నట్లు కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆరోపించారు. దాని పర్యవసానాలను కోవిడ్ సమయంలో అందరూ ప్రత్యక్షంగా అనుభవించారని చెప్పుకొచ్చారు. 14 సంవత్సరాల ముఖ్యమంత్రి కాలంలో చంద్రబాబు రాష్ట్రానికి 22 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. జగన్ రెడ్డి ఐదు సంవత్సరాలలో కేవలం ఐదు కాలేజీలను మాత్రమే తెచ్చారని విమర్శించారు. అవి కూడా నిర్మాణాలు పూర్తి చేయలేదని ఎద్దేవా చేశారు. జగన్ రెడ్డి అసంపూర్ణంగా వదిలిపోయిన కాలేజీ నిర్మాణాలను కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తోందని స్పష్టం చేశారు. ఇంకా అదనంగా 10 కొత్త మెడికల్ కాలేజీలను పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య మోడల్‌లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

**జగన్ ఊరువాడా డప్పు కొడుతున్నారు..** అయితే.. 17 మెడికల్ కాలేజీలు తెచ్చానని ఊరువాడా డప్పు కొట్టుకుంటున్న జగన్మోహన్ రెడ్డి రూ. 8,480 కోట్లకు గాను కేవలం రూ. 1,451 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఆరోపించారు. ఇందులో రూ. 975 కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందించిందని పేర్కొన్నారు. జగన్ రెడ్డి నియోజకవర్గం పులివెందుల కాలేజీకి రూ. 168 కోట్లు పెండింగ్ వర్క్స్ ఉన్నాయని తెలిపారు. జాతీయ వైద్య మండలి(ఔఓఅ) పాడేరు, మార్కాపూరు, మదనపల్లి, ఆదోని, పులివెందుల్లోని కళాశాలల నిర్మాణాలపై అసంతృప్తి వ్యక్తం చేసిందని ఆయన చెప్పుకొచ్చారు

# పులకించిన భక్తజనం

## శోభాయమానంగా గనేశ్ నిమజ్జనోత్సవం

## ట్యాంక్ బండ్ పరిసరాల్లో పండగశోభ

## మధ్యాహ్నానికి బడా గణేశ్ నిమజ్జన పూర్తి

హైదరాబాద్, సెప్టెంబర్6: వినాయ నిమజ్జన ఘట్టం కన్నుల పండువగా సాగింది. కేరింతలు, డ్యాన్సులు, భక్తి పారవశ్యం మధ్య చిందులేస్తూ సాగరతీరానికి సాగినయాత్ర కనువిందు చేసింది. ఉదయం మొదలైన శోభాయాత్ర రాత్రి వరకు కొనసాగింది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ బడా గణేశ్ నిమజ్జన పక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎన్టీఆర్ మార్గ్‌లోని బాహుబలి క్రేన్ పాయింట్ 4 వద్ద నిమజ్జనోత్సవాన్ని చేపట్టారు. వేలాదిగా తరలివచ్చిన భక్తుల జయజయధ్వానాల మధ్య మహాగణపతికి ఘనంగా వీడ్కోలు పలికారు. అంతకుముందు వినాయ`కుడికి ఉత్సవ సమితి నిర్వాప`కులు తుది పూజలు నిర్వహించారు. ఇక ఈ ఉదయం 7 గంటలకు బడా గణేశ్ శోభాయ`హత్ర వైభవంగా ప్రారం భమైంది. రాజ్‌దూత్ సర్కిల్, -టె-లిఫోన్ భవన్, తెలుగుతల్లి ÷-లఫ్లైఓవర్ మీదుగా వినాయకుడు ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకున్నాడు. ఈ నేపథ్యంలో శోభాయాత్ర మార్గంతోపాటు- ఎన్టీఆర్ మార్గ్‌లో పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. ఖైరతాబాద్ మహా గణపతికి నభూతో నభవిష్యతి అనేలా కనివినీ ఎరుగని రీతిలో భక్తజనం ఘనంగా



వీడ్కోలు పలికారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మార్గ్ వద్ద ఏర్పాటు- చేసిన బాహుబలి క్రేన్ పాయింట్ 4 దగ్గర బడా గణపతి నిమజ్జనం అనుకున్న సమయానికే ప్రశాంతంగా ముగిసింది. వేలాది భక్తులు 'గణపతి బప్పా మోరియా' అని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ.. మళ్లీ తిరిగి రావయ్యా వినాయకా.. అంటూ వైభవోపేతంగా సాగనంపారు. నిమజ్జనానికి ముందు ఉత్సవ సమితి సభ్యులు శాస్త్రోక్తంగా తుదిపూజలు నిర్వహించారు. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా ఖైరతాబాద్ బడా గణపతి భక్తులకు దర్శనమిచ్చాడు.




# సంపాదకీయం

ఆదివారం 07-09-2025

## ట్రంప్‌కు పట్టిన దెయ్యం దిగివచ్చేలా చేయాలి !

ఎవరు తవ్వుకున్న గోతిలో వారే పడతారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఇది బాగా నరిపోతుంది. టారిఫ్‌లు పెంచి ప్రపంచాన్ని లొంగదీసుకుందామనుకున్న ట్రంప్‌కు అనూహ్యంగా ఎదురుదెబ్బలు తాకుతున్నాయి. ఎంతగా అంటే అమెరికాను ధిక్కరించేంతగా. తొలుత చైనా గట్టిగానే ఎదిరించింది. ఇప్పుడు భారత్ కూడా మాట్లాడకుండా చెవి మెలిపెట్టింది. నీ లెక్కెంత అన్న తీరులో భారత్ చర్యలు ఉంటున్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోలును అడ్డం పెట్టుకుని టారిఫ్‌లు విధించడం ద్వారా ఇప్పుడు అమెరికా ఏకాకి అయ్యింది. షాంఘై సదస్సు తరవాత ట్రంప్‌లో అసహనం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. భారత్, చైనా,రష్యాలు ఏకమయ్యాయని, భారత్‌ను దూరం చేసుకున్నానని వలపోస్తున్నాడు. ఆ వలపోత ఏదో ముందే ఉండాలి. బెదరించి టారిఫ్‌లు విధిస్తే భారత్ లొంగుతుందని అనుకున్నాడు. అందుకే భారత్ మాట్లాడకుండా సమాధానం ఇస్తోంది. రష్యానుంచి బరాబర్ ఆయిల్ కొనుగోలు చేస్తామని తేల్చింది. కేంద్రమంత్రులు హర్దీప్ సింగ్, నిర్మలా సీతరామన్‌లు కూడా రష్యా చమురు కొనుగోళ్లను సమర్థించారు. అలాగే అమెరికా బెదిరింపు లకు తలొగ్గేది లేదని తేల్చారు. ఈ క్రమంలో ట్రంప్ నిర్వేదంలో ఉన్నాడు. తాను అనుకున్న దానికన్నా భారత్ భిన్నంగా ఉందన్న విషయం ఇప్పుడిప్పుడే అవగతం అవుతోంది. నిజానికి భారత్ తలచుకుంటే అమెరికా దెబ్బతినడం ఖాయం. అక్కడ ఉన్న టెక్కీలు భారత్‌కు తిరిగివస్తే నష్టపోయేది అమెరికాయే. మరో విషయం ఏమంటే మొన్నటి ఎన్నికల్లో ఎన్నారైలు అంతా గంపగుత్తగా ట్రంప్‌కు ఓటేశారు. ఈ కృతజ్ఞత కూడా ట్రంప్‌కు లేకుండా పోయింది. అక్కడున్న మేథావులంతా భారతీయులే అని కూడా ట్రంప్ గుర్తించ కుండా టెక్కీలపై ఆంక్షలు విధిస్తున్నాడు. ఈ విషయం గుర్తించకుండా ట్రంప్ కర్రపెత్తనం చేయబోయారు. ప్రస్తుతం క్లిష్టమైన సమయం నడుస్తున్నది.ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అచ్చోసిన ఆంబోతులా టారిఫ్ దురాక్రమణ చేపట్టాడు. ఇలాంటి నేపథ్యంలో తియాన్‌జిన్ సమావేశం ట్రంప్ దృష్టిని ఆకర్షించింది. ఇదో రకంగా ట్రంప్‌కు వ్యతిరేకంగా జరిగిందా అన్న రీతిలో మూడు ప్రధాన దేశాలు ఐక్యతను చాటాయి. ట్రంప్ టారిఫ్‌లపై రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా విరుచుకు పడ్డారు. ఇది ఏకపక్షమని అన్నారు. చైనా, భారత్ లాంటి దేశాలను దూరం చేసుకోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. అమెరికా నాయకత్వం ప్రపంచ వ్యవస్థకు మరింత వేగవంతమైన తక్షణ ప్రతిస్పందన కావాలనే హడావుడి చేస్తోంది. షాంఘై సదస్సు ఏం సాధించిందన్న దానికి ట్రంప్ అంతర్మథనం అద్దం పడుతుంది. ఈ మార్పు నిస్సందేహంగా ఒక బహుళ ధృవ ప్రపంచం అవసరాన్ని తెరపైకి తీసుకుని వచ్చింది. తియాన్‌జిన్ రేవు పట్టణం షాంఘై సహకార సమితి శిఖరాగ్ర సమావేశానికి ఘనంగా ఆతిథ్యమిచ్చింది. ఎస్.సి.వో తన పరిధిని విస్తరించుకుని ఆర్థిక సహకారం, సాంస్కృతిక సంబంధాలు, ఇంధన రంగాలను కూడా చేర్చుకుంది. 21వ శతాబ్ది సవాళ్లనూ అవకాశాలను ఎస్.సి.వో స్వీకరించిందని చెప్పడానికి సంకేతమా అన్నట్లు- చైనా ఇటీవలి కాలంలో సాధించిన ఆశ్చర్యకర పురోగమనాన్ని ప్రతిబింబించే ప్రదర్శన నిర్వహించింది. ఇండియా రష్యా నుంచి చమురు కొని ఎక్కువ లాభానికి అమ్ముకుంటున్నదనే సాకు ప్రధానంగా ముందుకు తెచ్చి భారత్, బ్రెజిల్ దేశాలపై ట్రంప్ టారిఫ్‌లు దారుణంగా వేటు- వేశాయి. నిజానికి ట్రంప్ ఉన్మాదపూరితంగా తయారైనాడు. భారత దేశ ఆర్థిక వ్యవస్థ నిర్జీవంగా తయారైందనీ, దాంతో వ్యాపారం చేయడమంటే కోరి ఏకపక్ష వినాశనం కొని తెచ్చుకోవడమేననీ నోరు పారేసుకున్నాడు. సైనిక ఘర్షణల విరమణలో తన పాత్రకు భారత్ తగినంత గుర్తింపునివ్వలేదని కూడా ట్రంప్ కుదేలైపోయాడు. ఆయన సహాయకులొకరైతే రష్యా ఉక్రెయిన్‌పై యుద్ధం చేయడానికి భారత్ కారణమనేంత వరకూ వెళ్లారు. ఇవన్నీ ఎంత వరకూ నిజాలో ఎవరైనా ఊహించుకోవచ్చు. ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకునే విధంగా భారత్‌ను లొంగదీసు కోవడమే ఇక్కడ అమెరికా ప్రధానోద్దేశంగా ఉంది. బహుళ ధృవ ప్రపంచ దృశ్యం, సామర్థం, సత్తా ఏమిటో తియాన్‌జిన్ చూపెట్టింది. సీ జిన్‌పింగ్, వ్లాదిమిర్ పుతిన్, నరేంద్ర మోడీలు అక్కడ వుండటం సుస్థిర ప్రపంచ వ్యవస్థను నొక్కి చెప్పింది. ప్రాంతీయ, ప్రపంచ భద్రతపై ఎస్.సి.వో కేంద్రీకరించింది. ఇజ్రాయిల్, అమెరికాల సైనిక దాడులను తీవ్రంగా ఖండించింది. అవి అంతర్జాతీయ చట్టాలనూ ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను ఉల్లంఘించేవిగా వున్నాయి. ఇరాన్ సార్వభౌమాధికారానికి తూట్లు పొడిచేవిగా జరిగాయని పేర్కొంది. తియాన్‌జిన్ సమావేశానికి ముందు మోడీ, జిన్‌పింగ్‌లు శిఖరాగ్ర సమావేశం జరిపినప్పుడే గాలి ఎటు- వీస్తున్నదీ స్పష్టమైపోయింది. భారత్, చైనాలు భాగస్వాము లేగానీ విరోధులు కాద న్నది ఉమ్మడి స్ఫూర్తిగా వచ్చిన ప్రధాన సందేశం. బహుళ ధృవ ప్రపంచం, వాణిజ్య స్వేచ్ఛను ప్రముఖంగా చెబుతూ న్యాయమైన, సహేతుకమైన పరస్పర అంగీకార యోగ్యమైన పరిష్కారాలను కనుగొనాలని ఈ రెండు దేశాలు అవగాహనకు వచ్చాయి. విదేశాంగ శాఖ విడుదల చేసిన ప్రకటన పేర్కొన్నట్టుగా ప్రపంచ వాణిజ్య సుస్థిరత సాధించడంలో ఉభయ దేశాల ఆర్థిక వ్యవస్థల పాత్రను ప్రస్తావించాయి. విధానపరమైన స్వీయ నిర్ణయాధికారాన్ని ఇరు దేశాలు పాటిస్తాయి. ఉమ్మడి ప్రయోజనాలు కాపాడుకునే దిశలో బహుముఖ సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని సీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. మొత్తం భారత్, చైనా సంబంధాలను సరిహద్దు సమస్యను బట్టి మాత్రమే నిర్ణయించరాదని కూడా ఆయన చెప్పారు. ఈ క్రమంలో విశాల భౌగోళిక దృష్టితో భారతదేశ ప్రయోజనాలను ట్రంప్ చూడటం లేదని తేలిపోయింది. ఆసియాలో బలాబలాల సమతుల్యతకు సంబంధించి భారత దేశం విలువేమిటో ఆయనకు తెలియలేదని అర్థమై పోయింది. భారత అమెరికా సంబంధాలను గమనిస్తున్న వారికి మాత్రం ఇది పెద్ద ఆశ్చర్యం కలిగించదు. ఇది ఎప్పుడో జరగవలసి వున్నదే. ఆపరేషన్ సిందూర్ తర్వాత ..కాల్పుల విరమణకు తానే కారణమంటూ ఉన్మాద పూరితంగా ట్రంప్ ఏకపక్షంగా చెప్పుకోవడం చూసినప్పుడే ట్రంప్ టెంపరితనం ప్రపంచానికి అర్థం అయ్యింది.

# తెలంగాణ, దక్షిణ భారత దేశానికి గేమ్ చేంజర్ గా ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి ...

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**

**నవంబర్ నాటికి ఒకవైపు ధంసలాపురం ఆర్.ఓ.బి. పూర్తి**

**ధంసలాపురం వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను తనిఖీ చేసిన మంత్రి తుమ్మల**

ఖమ్మం, సెప్టెంబర్ - 6: ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి భవిష్యత్తులో తెలంగాణ, దక్షిణ భారత దేశానికి గేమ్ చేంజర్ గా మారబోతున్నదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.మంత్రివర్యులు, శనివారం ధంసలాపురం వద్ద ఖమ్మం దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను తనిఖీ చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే ఆర్ఓబి, ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి పరిశీలించారు. మంత్రి, అధికారులకు, ఏజెన్సీలకు పలు సూచనలు చేశారు.



ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఖమ్మం దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులో తేవాలని అన్నారు. 160 కిలోమీటర్ల జాతీయ రహదారి పూర్తి కావడం వల్ల గంటన్నర సమయంలో రాజమండ్రి వెళ్ళవచ్చని అన్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రజలకు, ఇక్కడి వారికి ఈ రోడ్డు ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. ఉత్తర దక్షిణ భారతదేశాన్ని కలిపే రహదారిగా తయారవుతుందని అన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి డిజైన్స్ ఆలస్యం కావడం వల్ల ఆలస్యం జరిగిందని అన్నారు. ధంసలాపురం ఆరోఓబి నవంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఆర్.ఓ.బి. నిర్మాణానికి సంబంధించి హై టెన్షన్ విద్యుత్ లైన్స్ తరలింపు, భూసేకరణ వంటి అన్ని పనులు పూర్తి చేశామని, నవంబర్ నాటికి ఒకవైపు రైల్వే బ్రిడ్జి పూర్తి చేసుకుంటే సత్తుపల్లి జంగారెడ్డిగూడెం వరకు ఉపయోగపడుతుందని అన్నారు. కొత్త సంవత్సరంలో ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి రావాలని అన్నారు. రైల్వే శాఖను సమన్వయం చేసుకుంటూ ఆర్ఓబీ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. రైల్వే, కెనాల్, మున్నేరు పై రహదారి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నుంచి సత్తుపల్లి వరకు జాతీయ రహదారికి సర్వీస్ రోడ్లు వేస్తే రైతాంగానికి ఉపయోగ పడుతుందని, దీనికి కావలసిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా వ్యవసాయ ప్రాంతం అధికంగా ఉందని, నాగార్జున్ సాగర్ కాల్వ క్రింద ఆయకట్టు ఉన్నందున 365 రోజుల పాటు హార్వెస్టర్ రాకపోకలు ఉంటాయని, రహదారి వాహనాలకు ఆటంకం కలగకుండా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. వర్షాలు తగ్గిన నేపథ్యంలో మున్నేరు బ్రిడ్జ్ తో పాటు ధంసలాపురం ఎగ్జిట్ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. 3500 కోట్లతో ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి నిర్మిస్తున్నామని అన్నారు. జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి చిన్న, చిన్న సమస్యలు ఉంటే కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, నేషనల్ హైవే పిడి దివ్య, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబ్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, కార్పొరేటర్లు, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ సైదులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో పింఛన్లు పెంచే వరకు ఉద్యమం: మందకృష్ణ మాదిగ

తాండూర్ : తెలంగాణలో పింఛన్లు పెంచే వరకు ప్రభుత్వంపై ఉద్యమాలు చేపడుతూనే ఉంటుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు . శనివారం మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో చేపట్టిన మహా గర్జన సన్నాహక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రూ. 200కు పెంచారని , దశలవారీగా ఎమ్మార్పీఎస్ చేసిన పోరాటలతోనే 2014లో అన్ని పార్టీలు వేయి రూపాయల పెన్షన్ ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాయని గుర్తు చేశారు. తమ పోరాటాల ఫలితంగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వెయ్యి రూపాయల పెన్షన్ పెంపు సాధ్యమైందన్నారు.



అనంతరం 2019 ఎన్నికల్లో కూడా ఎమ్మార్పీఎస్ ఒత్తిడితోనే రూ. 2 వేల పెన్షన్ పెంపు సాధ్యమైందన్నారు 2023లో రూ. 4వేల పెన్షన్‌ను ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 21 నెల లైనా ఆ ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులతో ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పెన్షన్ పెంపును విస్మరించడం సరికాదన్నారు. ఈ పెన్షన్ పెంపు చేపట్టే వరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈనెల 8న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి, 20న మండల తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన, హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధం తోపాటు దశల వారి ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి జిలకర శంకర్, నాయకులు గణేష్, తదితరులు ఉన్నారు.

# కాళేశ్వరం విచారణలో తొలి అడుగు

**హైదరాబాద్‌కు సిబిఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్..!!**

హైదరాబాద్ ,కాళేశ్వరం అవినీతి అంశంపై మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ మేరకు సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ హైదరాబాద్ కు వచ్చారు.కోఠీలోని సీబీఐ బ్రాంచ్ ఆఫీసులో అధికారులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నివేదికపై విచారణ నేపథ్యంలో ఆయన ఆకస్మికంగా హైదరాబాద్‌కు ప్రధాన్యతను సంతరించుకుంది. కాగా, కాళేశ్వరంపై కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసిన విషయం విదితమే. ఎన్డి ఎస్ఏ, రిపోర్ట్ ఆధారంగా జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ ఇచ్చిన కాళేశ్వరం నివేదికపై సీబీఐ ఎంక్వైరీ చేయాలని విజ్ఞప్తి చేసింది. కాళేశ్వరం కార్పొరేషన్, అంతరాష్ట్ర అంశాలపై విచారించాలని ప్రతిపాదనలు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయంపై విచారించాలని లేఖలో ప్రస్తావించారు. అదేవిధంగా కాళేశ్వరంలో భారీగా అవకతవకలు జరిగాయని, ప్రాజెక్టుల డిజైన్, క్వాలిటీ, లోపాల వల్లే నిర్మాణ వైఫల్యమని ఎన్ డి ఎస్ఏ, రిపోర్టు ఇచ్చిందని తెలిపారు. ప్రజాప్రతినిధుతో పాటు ప్రాజెక్టులలో భాగస్వాములైన కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రైవేట్ కంపెనీలపై విచారణ జరపాలని సీబీఐకి రాసిన లేఖలో తెలంగాణ సర్కార్ కోరింది.ప్రవీణ్ సూద్ కర్ణాటక కేడర్‌కు చెందిన 1986 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఈయన కర్ణాటక డైరెక్టర్ జనరల్, ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్. . ప్రవీణ్ సూద్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ సిబిఐ, కు కొత్త డైరెక్టర్‌గా నియమితులై 25 మే 2023న బాధ్యతలు స్వీకరించారు. మరో రెండేళ్ల పాటు ఆయన ఆ పదవిలో కొనసాగుతారు. సుబోధ్ జైస్వాల్ తర్వాత దేశంలో అత్యంత సీనియర్ ఐపీఎస్ అధికారి ప్రవీణ్ సూద్ కావడం విశేషం.ఫస్ట్ అటెంప్ట్‌లోనే సివిల్స్ సాధించి..ప్రవీణ్ సూద్ 1964లో హిమాచల్ ప్రదేశ్‌లో జన్మించారు. ఆయన తండ్రి, దివంగత ఓం ప్రకాష్ సూద్ ఢిల్లీలో ఓ ప్రభుత్వ గుమాస్తా పనిచేసేవారు. ఆయన తల్లి దివంగత కమలేష్ సూద్, ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలు. ప్రవీణ్ పాఠశాల విద్యను పూర్తి చేసిన తర్వాత, ఐఐటీ జేఈఈ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. అనంతరం ఐఐటీ ఢిల్లీలో సీటు సంపాదించి అక్కడే ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఫస్ట్ అటెంప్ట్‌లోనే ప్రవీణ్ సూద్ యూపీఎస్సీ సివిల్స్, పరీక్షలో ర్యాంక్ సాధించారు. 1989లో మైసూరులో తొలి పోస్టింగ్ పొందారు. అక్కడ ఆయన వినూత్నమైన, నిజాయితీ గల పోలీసు అధికారిగా పేరు పొందాడు

# నేడు గ్రహణం సందర్భంగా సూర్య దేవాలయంలో గ్రహణ శాంతి హోమములు..

విభారే న్యూస్ సెప్టెంబరు 06 కర్నూలు జిల్లా ప్రతినిధి..నేడు స్వస్తిశ్రీ విశ్వవసు నామ సంవత్సర భాద్రపద శుక్ల పూర్ణిమ ఆదివారం శతభిషా నక్షత్ర కుంభరాశి మేషలగ్నము లందు రాహుగ్రస్త చంద్రగ్రహణం. సంభవించును. చంద్రగ్రహణ సమయములు.1) గ్రహణ స్పర్శ కాలం-(రా. 10.00 ని.)2) మధ్యకాలం-(రా. 11- 45ని. )3) మోక్ష కాలం-(తె.1-30 ని.)శతభిషా నక్షత్రం పూర్వాభాద్ర నక్షత్రం వారు గ్రహణం చూడరాదు కుంభం మిథునం తులా రాశిల వారు కూడా గ్రహణ శాంతి చేసుకోవలెను. గ్రహణ దానంబియ్యము.మినుములు పెసలు అలసందలు వెండి సర్పంప్రతిమ చంద్ర ప్రతిమ దానం చేయవలెనుసోమవారం 8-9-2025 ఉదయం 9.గంటలకు చంద్రగ్రహణ శాంతి హోమం నిర్వహించబడును చంద్రగ్రహణ హోమం ప్రధానంగా 2500చంద్రగ్రహణ హోమ సంకల్పం 116సంప్రదించిన నంబర్లు 7981012787 6300654654 దేవాల యం ఫోన్ పే గూగుల్ పే నెంబరు..8896123777.

# మెప్మా విభాగంపై సమగ్ర సమీక్ష

**అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్ కీలక సూచనలు**



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 06-నంద్యాల అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో శనివారం మెప్మా సీఎంఎం. మరియు సిబ్బందితో అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై సమీక్ష జరిపి సూచనలు చేశారు. ముఖ్యంగామెప్మా విభాగంలో ఉన్న కోర్టు కేసులు పీఎం సూర్యగర్ అమలు స్వర్ణాంధ్ర ? స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు విభాగం సాధించిన ప్రగతి నివేదికలుప్లాస్టిక్ ఫ్రీ పై చర్యలుఆడిట్ నివేదికలు డీజీ లక్ష్మి అమలు మహిళలకు పెట్రోల్ బంకులు ఏర్పాటుతృప్తి క్యాంటీన్లుసర్వీసు రిక్వెస్ట్ పరిష్కారం యోగాంధ్ర కార్యక్రమంటెర్రస్ గార్డెన్లుస్ట్రీట్ వెండర్ సమస్యలు ఉద్యోగుల ప్రవర్తన నియమావళిప్రతి అంశంపై అధికారులు, సిబ్బంది స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని వెంకటదాస్ సూచిం చారు. ప్రజల సమస్యలను సమయానుకూలంగా పరిష్కరించి, పారదర్శకత తో సేవలందించడమే మెప్మా ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా మిరియాల రామ్మోహన్..


**- జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారి, ఎంపీ చేతుల మీదుగా ఉత్తమ ప్రధానోపాధ్యాయుల అవార్డు..**




ఎమ్మిగనూరు విభారే న్యూస్ సెప్టెంబరు 06..మంత్రాలయం మండల పరిధిలోనిమాధవరం గ్రామం ఎంపీపీఎస్ (మెయిన్) పాఠశాలలో ప్రధానోపాధ్యా యులుగావిధులునిర్వహిస్తున్నరామ్మోహన్ ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ రంజిత్ భాష, డీఈఓ శామ్యూల్ పాల్ ఎంపీ బస్తి పాటి నాగరాజు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రామ్మోహన్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అవార్డు అందుకున్న రామ్మోహన్ ను ఏపీటీఎఫ్ వారి స్వచ్ఛమైన సుదీర్ఘ సేవలకు గుర్తుగా పూలహారం స్థానాన గులాబీ మొక్కను అందించి గులాబీ పూసే కొద్దీ ఈ మధుర జ్ఞాపకాలు మదిలో సుదీర్ఘకాలం మెదులుతూనే ఉంటాయని ఏపిటిఎఫ్ నాయకులు అభినందించారు.

# అధికారులకు అభినందనలు తెలిపిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రామ్మోహన్..

విభారే న్యూస్ సెప్టెంబరు 06 ఎమ్మిగనూరు. ఉపాధ్యాయ దినోత్సవం నాడు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న మిరియాల రామ్మోహన్ అందుకొరకు ప్రతిపాదనలు పంపి సిఫారసు చేసిన మండల విద్యాశాఖ అధికారులు పి. మొయినుద్దిన్ ఎంఈఓ 1, ఆర్. రాఘున్న ఎంఈఓ 2 ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఎం. ప్రభాకర్ ఎస్జిటి ఎంపిపిఎస్ మెయిన్ మంత్రాలయం, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది ఎం ఐ ఎస్ , సి ఆర్ ఎం టి ఎస్, నాకు అభినందనలు తెలిపిన గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయులు, ఎస్ఏలు, పి ఎస్ హెచ్ ఎమ్స్, ఎస్జీటీస్, అందరికీ పేరుపేరునా తన యొక్క హృదయపూర్వక నమస్కారాలు, అభివందనాలు, కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు



# మోడీతో లోకేశ్ భేటీలు..కథ అదేనా

విజయవాడ, సెప్టెంబర్ 6,ఢిల్లీ కేంద్రంగా ఏపీ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఏపీ మంత్రి నారా లోకేష్ తరచూ ప్రధాని నరేంద్ర మోదీని కలుస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకుంది. నాలుగు నెలల వ్యవధిలోనే లోకేష్ రెండుసార్లు ప్రధాని మోదీని కలిశారు. అయితే ఒక సాధారణ రాష్ట్ర మంత్రికి ప్రధాని అపాయింట్మెంట్ ఇవ్వడం అనేది ఇక్కడ కీలక పాయింట్. రాష్ట్రాల ముఖ్యమంత్రులకే కలిసేందుకు ప్రధాని అపాయింట్మెంట్ లభించడం కష్టం. అటువంటిది మంత్రి నారా లోకేష్ కు అపాయింట్మెంట్ దక్కుతుండడం వెనుక ఏంటి కథ అనేది ప్రధాన చర్చగా నడుస్తోంది. అయితే లోకేష్ ప్రధానిని కలిసిన ప్రతిసారి రాష్ట్రం కోసమేనని ప్రచారం జరుగుతోంది. తెలుగుదేశం పార్టీ అనుకూల మీడియా సైతం రాష్ట్ర ప్రయోజనాలు, పెండింగ్ ప్రాజెక్టుల కోసమేనని చెబుతూ వస్తోంది. అయితే దాని వెనుక బిజెపి భారీ వ్యూహం ఉందని తెలుస్తోంది. గతంలో జరిగిన తప్పిదాన్ని తెలుగుదేశం పార్టీ సరి చేసుకునే ప్రయత్నం చేస్తోందని విశ్లేషకుల అభిప్రాయం.తెలుగుదేశం పార్టీ 2019 నుంచి 2024 మధ్య సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంది. 2019 ఎన్నికలకు ముందు ఎన్డీఏ నుంచి బయటకు వచ్చింది తెలుగుదేశం. అది పరోక్షంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సహాయపడింది. ఎప్పుడైతే చంద్రబాబు ఎన్డీఏ కు దూరమయ్యారు బిజెపికి పరోక్షంగా దగ్గరయ్యే ప్రయత్నం చేసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అది తెలుగుదేశం పార్టీతో పాటు చంద్రబాబుకు తీవ్ర నష్టం చేసింది. 2018 ఎన్నికలకు ముందు చంద్రబాబు అరెస్టు అయ్యారు. 52 రోజులపాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. ఆ సమయంలో లోకేష్ పడిన తపన అంతా ఇంతా కాదు. ఢిల్లీలో రోజుల తరబడి ఉండిపోయి తండ్రి బెయిల్ కోసం ప్రయత్నించారు. ఆ సమయంలో హోం మంత్రిగా ఉన్న అమిత్ షా అపాయింట్మెంట్ కోసం తెగ ప్రయత్నం చేశారు. కానీ అపాయింట్మెంట్ దక్కలేదు. కానీ ఏడాది తిరిగేసరికి అదే లోకేష్ కు ప్రధాని మోదీ అపాయింట్మెంట్ ఇట్టే లభిస్తోంది.నాలుగు నెలల వ్యవధిలో మంత్రి నారా లోకేష్ ప్రధాని నరేంద్ర మోదీని కలవడం ఇది రెండోసారి. విశాఖ పర్యటనకు వచ్చినప్పుడు.. అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన సమయంలో కూడా ప్రధాని నరేంద్ర మోదీ.. లోకేష్ ను దగ్గరకు తీసుకున్నారు. ఢిల్లీకి ప్రత్యేకంగా ఆహ్వానించారు. దీంతో లోకేష్ ఈ ఏడాది మేలో కుటుంబ సమేతంగా ఢిల్లీ వెళ్లారు. ప్రధాని నరేంద్ర మోదీతో దాదాపు రెండు గంటలసేపు గడిపారు. తాజాగా మరోసారి ఈరోజు ప్రధాని నరేంద్ర మోదీతో దాదాపు గంట సేపు సమావేశం అయ్యారు నారా లోకేష్. రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని.. పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలని లోకేష్ కోరినట్లు టీడీపీ అనుకూల మీడియా రాసుకొచ్చింది. దానికే అయితే నారా లోకేష్ ఢిల్లీ వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని కలవనక్కర్లేదన్నది ఒక అభిప్రాయం. ఎప్పటికి సీఎం చంద్రబాబు తో పాటు మంత్రులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు తరచూ వెళ్లి కేంద్ర అధికారులకు కలుస్తున్నారు. కేంద్ర మంత్రులకు కలుస్తుండడంతో ఎప్పటికప్పుడు ఆ ప్రాజెక్టులకు మోక్షం కలుగుతోంది.ప్రధాని నరేంద్ర మోదీని మంత్రి నారా లోకేష్ తరచూ కలుస్తుండడం వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. ఎవరు అవునన్నా కాదన్నా తెలుగుదేశం పార్టీకి భావి నాయకుడు నారా లోకేష్. గత అనుభవాల దృష్ట్యా బిజెపితో లాంగ్ ట్రావెల్ చేయాలని టిడిపి భావిస్తోంది. మరోవైపు జాతీయ రాజకీయ అవసరాల దృష్ట్యా తెలుగుదేశం పార్టీని శాశ్వత మిత్రుడిగా చేసుకోవాలని చూస్తోంది. ఇలా రెండు పార్టీల పరస్పర ప్రయోజనాల కోసమే ప్రధాని నరేంద్ర మోడీని నారా లోకేష్ తరచూ కలుస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# 10న అనంతపురంలో సూపర్ సిక్స్ విజయోత్సవ సభ




అనంతపురం, సెప్టెంబర్ 6, ఏపీ సీఎం చంద్రబాబు వైసీపీ ఓటు బ్యాంక్ పై ఫోకస్ పెట్టారా? వైసీపీకి బలమైన ప్రాంతంలో చెక్ చెప్పాలని భావిస్తున్నారా? అందులో కొంత సక్సెస్ అయ్యారా? అదే ఊపును కొనసాగించాలనుకుంటున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ఈనెల 10న అనంతపురం జిల్లాలో సూపర్ సిక్స్ విజయోత్సవ సభను నిర్వహించనున్నారు. తద్వారా రాయలసీమ జిల్లాలకు బలమైన సంకేతాలు పంపించనున్నారు. గతంలో రాయలసీమ అంటే తెలుగుదేశం పార్టీకి మైనస్ అని చెప్పుకునేవారు. కానీ గడిచిన ఎన్నికల తర్వాత పూర్తి సీన్ మారింది. ఇదే స్ఫూర్తిని 2029 ఎన్నికల వరకు చాటాలని చంద్రబాబు స్ట్రాంగ్ గా నిర్ణయించుకున్నట్లు సమాచారం.2019 ఎన్నికల్లో రాయలసీమలోతెలుగుదేశం పార్టీ గెలిచింది కేవలం మూడు స్థానాల్లో మాత్రమే. కుప్పం నుంచి చంద్రబాబు, హిందూపురం నుంచి నందమూరి బాలకృష్ణ, ఉరవకొండ నుంచి పయ్యావుల కేశవ్ మాత్రమే గెలిచారు. అటు తరువాత ప్రతి ఎన్నికలోను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధిస్తూ వచ్చింది. అయితే 2019 నుంచి 2024 మధ్య రాయలసీమ ప్రజల్లో ఒక రకమైన అభిప్రాయం ఏర్పడింది. దాని ప్రభావం 2024 ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. స్వల్ప సంఖ్యలో మాత్రమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఓ ఆరు చోట్ల మాత్రమే రాయలసీమలో ఆ పార్టీ ప్రభావం చూపింది. టిడిపి కూటమి దాదాపు రాయలసీమలో స్వీప్ చేసింది. అప్పటినుంచి చంద్రబాబుతో పాటు నారా లోకేష్ స్పెషల్గా దృష్టిపెట్టారు రాయలసీమపై. ఒకవైపు రాజకీయంగా.. ఇంకోవైపు అభివృద్ధి పరంగా రాయలసీమపై ఫుల్ ఫోకస్ చేశారు తండ్రీ కొడుకులు. దాని సత్ఫలితాలు వస్తుండడంతో ఇప్పుడు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయడం ప్రారంభించారు.గతంలో ఎన్నడూ లేని విధంగా కడప నడిబొడ్డులో మహానాడు నిర్వహించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సవాల్ చేశారు. ఒక విధంగా చెప్పాలంటే పులివెందులతో పాటు ఒంటిమిట్ట జడ్పిటిసి ఎన్నికల్లో గెలుపునకు అదే నాంది అయింది. వైసిపి ఆరోపిస్తున్నట్టు అధికార పార్టీ దుర్వినియోగం చేసినా.. కనీసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు రాకపోవడం గమనార్హం. ఇదే పట్టు కొనసాగించాలని చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. అందుకే కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకెళ్లి సస్యశ్యామలం చేయాలనుకున్నారు. ఇంకోవైపు పెద్ద ఎత్తున పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కూడా భావిస్తున్నారు. పనిలో పనిగా ఈ నెల 10న అనంతపురంలో సూపర్ సిక్స్ విజయోత్సవ సభను నిర్వహించాలని భావిస్తున్నారు. వాస్తవానికి ఈ సభను ఉభయగోదావరి జిల్లాలో ఏర్పాటు చేయాలని భావించారు. కానీ రాయలసీమలో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలంటే అక్కడే నిర్వహించడం కరెక్ట్ అని ఒక నిర్ణయానికి వచ్చారు.

# బి ఎస్ పి రాజకీయ శిక్షణ తరగతులు

నరసరావుపేట, పల్నాడు జిల్లా పట్టణ కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ క్యాడర్ క్యాంపు పల్నాడు జిల్లా అధ్యక్షులు బుదాల బాబురావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా, బి ఎస్ పి స్టేట్ సెంట్రల్ కో ఆర్డినేటర్ లక్కెపోగు వందనకుమార్ పాల్గొని రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యా వంతులు పాల్గొన్నారు.

# జగన్ సభ్యత్వం రద్దయితే... ఉపఎన్నిక...

కడప, సెప్టెంబర్ 6, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంది. ఆయన అసెంబ్లీకి రాకపోతే ఎమ్మెల్యే పదవికే ఎసరు వస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటి వరకూ బడ్జెట్ సమావేశాలు తొలి రోజు అంటే గవర్నర్ ప్రసంగం ఉండే సమయంలో మాత్రమే జగన్ తో పాటు ఆయన పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యేలు హాజరవుతున్నారు. పదకొండు మంది ఎమ్మెల్యేలు గత ఎన్నికల్లో గెలవడంతో వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వలేమని అధికార పక్షం చెబుతుంది. అదే సమయంలో శాసనసభలో ప్రతిపక్షం అనేది లేదు కాబట్టి తమకు ఆ హోదా ఇవ్వాలని వైసీపీ డిమాండ్ చేస్తుంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం శాసనసభలో పది శాతం మంది సభ్యుల బలం ఉంటేనే ప్రతిపక్ష హోదా ఇస్తారు. అంటే కనీసం పందొమ్మిది మంది ఎమ్మెల్యేలు ఉండాల్సి ఉంటుంది. అయితే గత ఎన్నికల్లో పదకొండు మంది ఎమ్మెల్యేలు మాత్రమే వైసీపీ నుంచి గెలవడంతో ప్రతిపక్ష హోదా ఇవ్వలేమని కూటిమి పార్టీ లు చెబుతుంది. అయితే తమకు ప్రతిపక్ష హోదా దక్కితేనే ప్రజాసమస్యలపై చర్చించడానికి అవసరమైన సమయం దక్కుతుందని వైసీపీ వాదిస్తుంది. తమ గొంతు వినిపించని సభలో తాము ఎందుకు రావాలంటూ వైసీపీ ప్రశ్నిస్తుంది. అయితే ఈసారి ఖచ్చితంగా జగన్ తో పాటు ఎమ్మెల్యేలందరూ హాజరు కావాల్సి ఉంది. లేకపోతే రాష్ట్రంలో మరో ఉప ఎన్నిక వచ్చే అవకాశముంది. టీడీపీలో హాట్ టాపిక్ అరవై రోజులు వరసగా... ఒక సభ్యుడు వరసగా అరవై సమావేశ దినాలు గైర్హాజరయితే ఆ సభ్యుడు తన ఎమ్మెల్యే పదవి కోల్పోయే అవకాశముంది. ఆ నియోజకవర్గంలో ఎమ్మెల్యేను అనర్హుడిగా ప్రకటించే ఛాన్స్ ఉంది. ఈ అధికారం రాజ్యాంగంలో శాసనసభకు ఉంది. అయితే జగన్ మాత్రం ఈసారి అసెంబ్లీ సమావేశాలకు ఖచ్చితంగా హాజరు కావాల్సి ఉంటుంది. లేకపోతే పులివెందులకు ఉప ఎన్నికలు రావడం ఖాయంగా కనిపిస్తుంది. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోయినా జగన్ శాసనసభ సమావేశాలకు హాజరవుతారా? లేక ఉప ఎన్నికల్లో తేల్చుకుందామని జగన్ గైర్హాజరవుతారా? అన్నది చూడాల్సి ఉంది. జగన్ పంతానికి పోతే పదవికే ప్రమాదం సంభవిస్తుంది. రాజీ పడితే సభలో ఏం జరుగుతుందన్నది ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. శాసనసభకు హాజరైతే మాత్రం సమావేశాలు హాట్ హాట్ గా జరిగే అవకాశముంది.

# పదే పదే చెబుతున్నా..మార్పు ఎక్కడ...

విజయవాడ, సెప్టెంబర్ 6, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా ప్రభుత్వంపై వచ్చే విమర్శలకునేతలు స్పందించడం లేదు. నిజంగా టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు, అధికార పార్టీ ప్రతినిధులు యాక్టివ్ గా లేకపోవడానికి కారణాలేంటి? అన్నదానిపై పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. కూటమి ప్రభుత్వం ఏడాది కాలమే అయింది. అయినా సరే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను చాలా వరకూ చంద్రబాబు గ్రౌండ్ చేశారు. ప్రతి నెల ఒకటో తేదీన ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్వయంగా పాల్గొంటున్నారు. లబ్దిదారుల ఇళ్లకు వెళుతున్నారు. అదే సమయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో కూడా చంద్రబాబు సమావేశమవుతున్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో పాటు, అనేక అభివృద్ధి పనులకు సంబంధించిన విషయాలను పదే పదే ప్రస్తావిస్తున్నప్పటికీ నేతలకు మాత్రం చీమకుట్టినట్లయినా లేదన్న టాక్ పార్టీలో బలంగా వినిపిస్తుంది. కేవలం ఒకరిద్దరు మంత్రులు, కొందరు నాయకులు మాత్రమే వైసీపీ విమర్శలకు రియాక్ట్ అవుతున్నారు.

# చిత్తూరు నేతలకు లిక్కర్ లింక్...

తిరుపతి, సెప్టెంబర్ 6, లిక్కర్ లింకులు మొత్తం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వైసీపీ చుట్టూ తిరుగుతున్నాయి. రోజుకొకరు విచారణకు హాజరు కావడం?. ఒకరి తర్వాత ఒకరు అరెస్ట్ అవుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న టెన్షన్ వైసీపీ శ్రేణుల్లో పెరిగిపోతుందంట. దీంతో నెక్స్ట్ ఎవరన్న చర్చ జిల్లాలో పొలిటికల్ సర్కిల్లో సాగుతోంది. అయితే అసలు లిక్కర్ కేసులో వీరికి సంబంధం ఉందా అని ఆశ్చర్యం కలిగేలా నేతలు అరెస్టు అవ్వడంతో ఇప్పుడు హాట్ టాపిక్ మారింది. ఆ క్రమంలో వైసిపి లోని కొందరు సీనియర్లు సైతం అసలు ఈ జిల్లాలో ఎవరెవరికి లింకులు ఉన్నాయి అని ఆరా తీస్తున్నారంట.. వైసీపీ హయాంలో రూ.3,500 కోట్ల లిక్కర్ స్కాం. ఏపీ లిక్కర్ స్కాం కేసులో సిట్ దూకుడు పెంచింది. రూ. 3500 కోట్లపైగా స్కాం జరిగినట్లు గుర్తించిన సిట్ అధికారుల దర్యాప్తులో పలువురు జైలుపాలవుతున్నారు. ఇప్పటికే ధనంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డితో పాటు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి, చాణక్య, పైలా దిలీప్, బాలాజీ గోవిందప్ప ఈ కేసులో అరెస్ట్ అయ్యారు. పోలీసుల కస్టడీలో విచారణ ఎదుర్కొంటున్నారు. వారితో పాటు మరో 39 వరకు సిట్ నిందితులుగా చేర్చింది. ఎన్నికల సమయంలో లిక్కర్ నిధులు పంచారని అభియోగాలు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వెంకటేష్ నాయుడు అరెస్టు అయ్యారు.వారిద్దరూ అరెస్టు తరువాత రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని సిట్ అరెస్టు చేసింది. ఇక చెవిరెడ్డి కుమారుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి లిక్కర్ కేసులో నిందితుడిగా ఉన్నారు. లిక్కర్ స్కామ్ లో వచ్చిన ముడుపులను చంద్రగిరి సహా పలు నియోజకవర్గాలో ఎన్నికల సమయంలో పంచారని అభియోగాలను ఎదుర్కొంటున్నారు. అయితే ఈ కేసులో ఉన్న వారందరిలో చిత్తూరు జిల్లాకు చెందిన వారే ఎక్కవగా ఉండటం గమనార్హం. జిల్లాలకు చెందిన మిథున్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మోహిత్రెడ్డి, చెవిరెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బాలాజీతో పాటు కిరణ్ కూమార్ రెడ్డి, సైఫ్ అహ్మద్లపై కేసు నమోదు అయ్యింది. ఇప్పటికే అరెస్టు అయ్యి జైల్లో ఉన్న వీరందరినీ సిట్ విచారించింది. ఎప్పటికప్పుడు కొత్త పేర్లు వస్తుండటంతో వైసీపీలో కలవరం. ఇక అక్కడితే ఆగుతుందని జిల్లా నేతలు భావిస్తున్న తరుణంలో ఎప్పటికప్పుడు కొత్త పేర్లు బయట వస్తుండడంతో ఎప్పుడు ఏంఎమీా జరుగుతుందనే టెన్షన్ ఇటు నేతల్లోను కేడర్ నెలకొందట. ఇక తన వరకు ఇక కేసు రాదనుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి సైతం నెల క్రితం అయనకు సిట్ నోటీసులు ఇవ్వడంతో అనారోగ్య కారణాల వల్ల వాట్సాప్ లో పంపిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అయితే దానికి సంతృప్తి చెందని సిట్ అధికారులు నేరుగా నారాయణ స్వామి ఇంటికి వచ్చి అరుగంటల పాటు విచారణ జరిపారు. దాంతో ఇక మాజీ డిప్యూటీ సీఎం, వైసీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన నారాయణస్వామి ఇక అరెస్టు అవుతారనే ప్రచారం జోరుగా సాగింది. అయితే సిట్ విచారణలో మద్యం పాలసీ మార్పులో ఆయన పాత్ర , అన్ లైన్ ద్వారా మద్యం బుకింగ్ లు మార్చి మ్యాన్ వల్ చేయడం, ప్రభుత్వ మద్యం దుకాణాల ఏర్పాటు, డిజిటల్ చెల్లింపులు ఎందుకు చేయలేదు అన్న అంశాలపై వందకు పైగా ప్రశ్నలు అడగటంమే కాకుండా టెక్నికల్ టీమ్స్ ద్వారా అయన గాడ్జెట్స్ ను పరిశోధించారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో అయన వాంగ్మూలం రికార్డు చేసినట్లు తెలిసింది. అయితే అయన చాలా ప్రశ్నలకు అంతా పైవారు చెప్పమన్నట్లు చేశానని చెప్పుకొచ్చారంట. ఆ క్రమంలో మొత్తం వ్యవహారం సీరియస్ అయ్యింది. అయితే నారాయణస్వామి ఎవరిపేర్లు చెప్పాడరనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.. విజయానందరెడ్డికి సిట్ నుండి పిలుపు. ఇక నారాయణ స్వామిని విచారణతో మాత్రమే సరి పెట్టడంతో అందరూ ఉపిరి పీల్చుకున్నారు.. అయితే ఊహించని విధంగా చిత్తూరు వైసీపీ ఇన్చార్జి విజయానందరెడ్డికి సిట్ నుండి పిలుపు రావడంతో విచారణ హాజరయ్యారు. వైసీపీ హయాంలో మద్యం డిపోల నుంచి షాపులకు తరలించేందుకు ఆయన కాంట్రాక్టు పొందారనే సమాచారం. పొరుగు రాష్ట్రాల్లో రవాణా చేసే ట్రాన్స్ పోర్ట్ కంపెనీలకు ఇస్తున్న మొత్తం కన్నా ఎక్కువకు ఈ కాంట్రాక్టు దక్కించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో చెవిరెడ్డి సూచనల మేరకు లిక్కర్ ముడుపుల్ని వైసీపీ అభ్యర్థులకు విజయానందరెడ్డి చేరవేసినట్లు సిట్ గుర్తించింది. వీటన్నింటిపై సుదీర్ఘంగా సిట్ అధికారులు ప్రశ్నించినట్లు టాక్ నడుస్తోంది. అలా జిల్లాలో నగరిలో రోజాకు ,తిరుపతి, కాళహస్తి, పూతలపట్టు, పీలేరు, జీడి నెల్లూరుకు అ నగదు చేరవేసినట్లు అనుమానిస్తున్నారంట. వీటిపై ఆయన మొదట తనకు ఏమీా తెలియదని, మద్యం సరఫరా కాంట్రాక్టు మాత్రమే చేశానని బుకాయించారంట. అయితే సిట్ అధికారులు చూపిన ఆధారాలతో గుట్టు విప్పక తప్పలేదంట. విజయానందరెడ్డిని సిట్ అధికారులు మరోసారి విచారణకు రావాలని చెప్పినట్లు సమాచారం. కీలక నేతల విచారణలతో వైసీపీ శ్రేణుల్లో టెన్షన్. చిత్తూరు జిల్లాలో వరుసగా వైసీపీ నేతలు సిట్ విచారణ హాజరవుతుండటంతో తర్వాత ఏం జరుగుతుందని టెన్షన్లో ఉన్నారట జిల్లా సీనియర్ నేతలు, క్యాడర్. జిల్లా సీనియర్ నేతల పరిస్థితి ఇలా ఉంటే మరోవైపు పార్టీ ప్రముఖులు సైతం అసలు కొన్ని విషయాలు తమకే తెలియని విధంగా ఉన్నాయంటూ ముక్కున వేలు వేసుకుంటున్నారట. ఆ క్రమంలో అసలు జిల్లాలో ఏం జరిగిందన్న విషయాన్ని కొందరు పార్టీ సీనియర్లు జిల్లా నేతల నుంచి పూర్తిస్థాయి సమాచారాన్ని అడిగి తెలుసుకుంటున్నట్లు సమాచారం. ఇక వీరితో పాటు తిరుపతి మాజీ ఎమ్మెల్యే, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి సైతం లిక్కర్ స్కామ్లో భాగం ఉందంటూ టిడిపి నేత పట్టాభి చేసిన వ్యాఖ్యలు జిల్లా వైసీపీలో మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయంట. ఇక ఎన్నికల సమయంలో మద్యం డిపోల నుండి వేలాది మద్యం బాటిళ్లను జిల్లాలో పంపిణీ చేశారని, అలా పంపిణీ చేసిన వాటిలో నగరిలోనే అతిపెద్ద స్థాయిలో మద్యం డంప్ను అధికారులు స్వాధీనం చేసుకున్నారని దానిని వెనుక ఎవరు ఉన్నారో తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు కూటమి నేతలు. ఇలా రాష్ట్రంలోనే అతిపెద్ద లిక్కర్ స్కామ్ గా చెబుతున్న కేసులో వరుసగాచిత్తూరు జిల్లాకు సంబంధించిన నేతలే చిక్కుకోవడంతో పార్టీ శ్రేణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారట

# తగ్గేదెలే అంటున్న కడప రెడ్డమ్మ..

కడప, సెప్టెంబర్ 6,మూడు దశాబ్దాల తర్వాత తొలిసారి కడప గడ్డ మీద టీడీపీ జెండా ఎగిరింది. వైసీపీకి కంచుకోట లాంటి నియోజకవర్గంలో పాగా వేయగలిగినా? ప్రస్తుతం కడప సెగ్మెంట్లో పార్టీ పరిస్థితి అయోమయంగా మారిందట. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి సైకిల్ గుర్తు మీద విజయం సాధించారు రెడ్డప్పగారి మాధవి. నాడు ఆమె గెలుపు కోసం కృషి.. నానా తంటాలు పడ్డ డివిజన్ ఇన్చార్జ్లో ఎక్కువ మంది ఇప్పుడు ఎమ్మెల్యేకు శత్రువులుగా మారినట్టు చెప్పుకుంటున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో కష్టించి పని చేసిన తమను కాదని, మాధవి కొత్త వ్యక్తులకు ఇన్చార్జ్ బాధ్యతలు అప్పగిస్తున్నారంటూ మండిపడుతున్నారట డివిజన్ నాయకులు. ఎన్నికలకు ముందు కడప నగర అధ్యక్షుడితో పాటు పలు డివిజన్స్కు ఇన్చార్జ్లను నియమించింది టీడీపీ. కానీ? మాధవి ఎమ్మెల్యే అయ్యాక మొత్తం మేటర్ మారిపోయిందట. గతంలో పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వకుండా తనకు అనుకూలమైన వారిని మాత్రమే ఇన్చార్జ్ పోస్టుల్లో నియమించినట్టు చెప్పుకుంటున్నారు. అదే ఇప్పుడు కేడర్లో అయోమయానికి ప్రధాన కారణమైందట. మూడు దశాబ్దాల తర్వాత ఇక్కడ పార్టీ జెండా ఎగరేసినా? తమకు మాత్రం ఎటువంటి ప్రయోజనం లేదని ద్వితీయ శ్రేణి నాయకులు ఆవేదన ఉన్నట్టు తెలుస్తోంది.గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న తమను కాదని కొత్తవారికి ప్రాధాన్యత ఇవ్వడంపై ఆగ్రహంగా ఉన్నారట. నిన్న మొన్నటి వరకు కుర్చీ గోలతో వివాదాల్లోకి ఎక్కిన కడప ఎమ్మెల్యే? ఇప్పుడు మరో విషయంలో నేను మోనార్క్ని అంటున్నట్టు సమాచారం. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో?తాను చెప్పిన వ్యక్తులే కడప కార్పొరేటర్లుగా పోటీ చేస్తారని ఆమె బహిరంగంగా అంటున్నారట. ఆ స్టేట్మెంట్స్ కారణంగా?టీడీపీలో వర్గ విభేదాలు పెరుగుతున్నాయంటున్నారు. అంతా ఆమె ఇష్టమేనా? పార్టీకంటూ ఒక నిర్ణయం ఉంటుంది కదా.. అంటూ స్థానిక తెలుగుదేశం నాయకులే గుసగుసలాడుకుంటున్నారు. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని ఉన్న తమను కాదని కొత్త వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై సీనియర్ నేతలు కూడా పెదవి విరుస్తున్నారు. కడప కార్పొరేషన్ లో ఖాళీగా ఉన్న రెండు కార్పొరేటర్ స్థానాలకు ఉప ఎన్నికల నిర్వహణ కోసం ఇక ఎప్పుడైనా? నోటిఫికేషన్ రావచ్చనుకుంటున్న టైంలో? ఎమ్మెల్యే వైఖరి చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే మాధవితో పాటు ఆమె భర్త, పార్టీ జిల్లా అధ్యక్షుడు వాసు నగరంలోని పలు డివిజన్స్లో పర్యటన చేస్తూ అప్పుడే మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని కూడా మొదలు పెట్టేశారట. వాస్తవానికి మున్సిపల్ పాలక మండలికి ఇంకా ఏడు నెలల గడువుంది.

# ఓటింగ్ ద్వారా ఐకాన్ ఎంపిక...

విజయవాడ, సెప్టెంబర్ 6, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజధాని అమరావతిని విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారితో అనుసంధానించేందుకు కృష్ణా నదిపై ఓ ఐకానిక్ కేబుల్ వంతెన నిర్మించాలని ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్ట్ అమరావతికి ప్రత్యేక గుర్తింపు కలిగించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇప్పటికే నాలుగు ప్రత్యేక డిజైన్లు ఎంపిక చేసి, వాటిలో ఒకదానిని ఎంపిక చేసేందుకు ప్రజల ఓటింగ్కు అవకాశం కల్పించింది రాష్ట్ర ప్రభుత్వం. ఈ కేబుల్ బ్రిడ్జి డిజైన్లు ఆధునిక ఇంజినీరింగ్ శైలితో పాటు కూచిపూడి కళను మిళితం చేసింది. ఎంపిక చేసిన నాలుగు నమూనాల్లో 3 కూచిపూడి నృత్య శైలిని ప్రతిబింబిస్తే, ఒక డిజైన్ అమరావతిని సూచించేలా ఆంగ్ల అక్షరం ‘ం’ ఆకారంలో ఉంది. ఇవన్నీ అమరావతికి ప్రత్యేక గుర్తింపును తీసుకురావడానికే రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి డిజైన్ను డిసైడ్ చేసే అవకాశాన్ని ప్రభుత్వం ఏపీ ప్రజలకే కల్పించిందిఆప్షన్ 1 కూచిపూడి నృత్యంలో, హస్త ముద్రలా ఉండే, రేడియేటింగ్ కేబుల్ బ్రిడ్జి. ఇంజనీరింగ్ ను, కళను కలగలిపి నిర్మించే బలమైన ఐకానిక్ వంతెన (కూచిపూడి హస్త ముద్రను ఎంపిక చేయండి)ఆప్షన్ 2 ఎరుపు, తెలుపు రంగుల్లో జంట పైలాన్లుతో మన సంస్కృతికి, అదృష్టానికి చిహ్నంగా. స్వస్తిక హస్త భంగిమలో ఉండే, కూచిపూడి డాన్స్ బ్రిడ్జి (కూచిపూడి స్వస్తిక హస్త భంగిమను ఎంపిక చేయండి)ఆప్షన్అమరావతి లోగో ం ఆకారంలో, అభయ ముద్రలో శాంతికి చిహ్నంగా ఉండే ఐకానిక్ వంతెన (అమరావతి లోగో ం ఆకారంలో, అభయ ముద్రను ఎంపిక చేయండి)ఆప్షన్ 4 కూచిపూడి నృత్యంలోని కపోత ముద్రలో, చేతులు ఎత్తి అభివాదం చేస్తున్నట్లుండే ఐకానిక్ వంతెన (కూచిపూడి కపోత ముద్రను ఎంపిక చేయండి)

## పోషక ఆహార వారోత్సవాల్లో భాగంగా....



విభారె న్యూస్ డోన్ మా ప్రతిని:-సెప్టెంబర్ 6 కొత్తకోట సెక్టార్ వెంకటాపురం గ్రామంలో పోషకాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యా శ్రీనివాసులు ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ పాల్గొన్నారు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బేటి బచావో బేటి పడావో అన్న నినాదంతో మన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు ఆడ పిల్లల కు చదువుతోపాటు పౌష్టికాహారం అందించాలి ఆడపిల్లల ను ఎక్కడ చిన్నచూపు చూడకుండా సమానత్వం కల్పించాలి అలాగే ఆడపిల్లలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపుల గురించి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముబారక్, మునీంద్ర, సచివాలయ సిబ్బంది ఏఎన్ఎం హైమావతి, మహిళా పోలీస్ ధనలక్ష్మి, అంగన్వాడీ వర్కర్లు స్వర్ణలత, ప్రసన్న, సత్యమ్మ, రాజేశ్వరి, ఉషారాణి, కృష్ణవేణి, రమణమ్మ, శివలక్ష్మి, సువర్ణ, వెంకటేశ్వరమ్మ, నాగ శ్రీనివాస దేవి, లక్ష్మి, విజయలక్ష్మి, సరిత, శకుంతల, శివలక్ష్మి, అనిత, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాకు భారీగా యూరియా రాక రైతులకు కలెక్టర్ భరోసా

### రైతు సేవా కేంద్రాల ద్వారా సమృద్ధిగా యూరియా పంపిణీ



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 06-నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి ఎం.సీ. మద్దిలేటి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గారి ఆదేశాల మేరకు గత రెండు రోజుల్లో జిల్లాకు 5200 మెట్రిక్ టన్నుల యూరియా చేరింది. ఈ యూరియాలో 3245 మెట్రిక్ టన్నులను జిల్లాలోని 28 మండలాల్లో గల 162 రైతు సేవా కేంద్రాలకు మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా చేశారు. 1955 మెట్రిక్ టన్నుల యూరియాను ప్రైవేటు డీలర్లకు అందజేశారు.రైతులు అవసరం మేరకు సమీపంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా పొందాలని సూచించారు.అలాగే, మరో రెండు రోజుల్లో సెప్టెంబర్ 9న 2600 మెట్రిక్ టన్నులు, సెప్టెంబర్ 12న 1500 మెట్రిక్ టన్నులు జిల్లాకు చేరనున్నాయని తెలిపారు. కాబట్టి రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.డీలర్లు ఎంఆర్పీ ధరకే యూరియా విక్రయించాలి, అధిక ధరలకు విక్రయించినా లేదా కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి స్పష్టం చేశారు.

## జిల్లాలో జ్వరాల నియంత్రణపై కీలక సమీక్షా సమావేశం

### వైద్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 06-నంద్యాల జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆర్. వెంకటరమణ ఆధ్వర్యంలో "జ్వరాల నివారణ చర్యలపై" సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పి. చంద్రశేఖరరావు, అసిస్టెంట్ మలేరియా అధికారి కె. సత్యనారాయణ, జిల్లాలోని ఏడు మలేరియా సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ ఆర్. వెంకటరమణ మాట్లాడుతూ, భారీ వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండి మలేరియా, డెంగ్యూ, మెదడు వాపు, ఫైలేరియా, చికెన్ గున్యా వంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో అధికారులు అప్రమత్తంగా ఉండి నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో యాంటీ లార్వా ఆపరేషన్ చేయాలని, ఇళ్లలో పైరిత్రం స్ప్రేయింగ్, ఫాగింగ్ వంటి దోమల నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అదేవిధంగా ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వేలు నిర్వహించి జ్వరాలపై సమాచారం సేకరించాలని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని కచ్చితంగా అమలు చేసి దోమల లార్వాలను నిర్మూలించాలని తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి వసతిగృహాలు, కేజీబీవీ హాస్టళ్లను పరిశీలించి మెస్సులు అమర్చడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అవసరమని సూచించారు.జ్వరాల నియంత్రణకు ఈ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని డాక్టర్ ఆర్. వెంకటరమణ స్పష్టం చేశారు.



## బాలల నృత్యార్చనతో కళారాధన సందడి

### కళారాధన కళా సేవలు నంద్యాలకు గొప్ప వరం:రామచంద్రరావు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 06-కళారాధన ఆధ్వర్యంలో, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సృజనాత్మక సంస్కృతి సమితి సహకారంతో, లయన్స్ క్లబ్, ఐఎంఏ సంయుక్త నిర్వహణలో "మాతృభూమికి కళార్చన" భాగంగా శనివారం స్థానిక ఎన్టీఆర్ పురపాలక సెంటినరీ టౌన్ హాల్ లో శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు నిర్వహించారు.కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, తెలుగుదేశం పార్టీ కార్యదర్శి వెదుర్ల రామచంద్రరావు జ్యోతి ప్రజ్వలన చేసి నృత్యోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళారాధన కళా సేవలు నంద్యాలకు గొప్ప వరమని, స్థానిక కళాకారుల ప్రతిభను దేశవ్యాప్తంగా చాటిందని తెలిపారు.ఈప్రారంభోత్సవంలో కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శి రవి ప్రకాష్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సోమేసుల నాగరాజు, కోశాధికారి అమిదేల జనార్ధన్ పాల్గొన్నారు.ఈ పోటీల్లో నంద్యాల, ఆదోని, కర్నూలు, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన రెండు వందల మంది బాలలు కూచిపూడి, భరతనాట్యం శైలిలో శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఉదయం నుండి రాత్రి వరకు కొనసాగిన ఈ నృత్య ప్రదర్శనలు కళాభిమానులను విశేషంగా అలరించాయి.పోటీలను కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి రవి ప్రకాష్, కార్యాలయ కార్యదర్శులు మధు, వెంకటేశ్వర్లు, సూర్య, ఇస్మాయిల్ పర్యవేక్షించారు. ఆదివారం ఆధునిక, దేశభక్తి నృత్య పోటీలు కూడా ఇదే వేదికలో జరుగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

## జిల్లాకు చేరిన 5200 మెట్రిక్ టన్నుల యూరియా

### ఈ నెల 9న 2600, 12న 1500 మెట్రిక్ టన్నులు

### రైతులు ఆందోళన చెందవద్దు

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 06-జిల్లాలో యూరియా కొరత లేదని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా స్పష్టం చేశారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో, ఇప్పటివరకు జిల్లాకు 5200 మెట్రిక్ టన్నుల యూరియా చేరినట్టు తెలిపారు. అందులో 3200 మెట్రిక్ టన్నులను రైతు సేవా కేంద్రాలకు పంపిణీ చేసి, మిగిలిన 2000 మెట్రిక్ టన్నులను రిటైలర్లకు సరఫరా చేశామని తెలిపారు.రైతుల అవసరాలకు సరిపడా యూరియా అన్ని రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉందని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఇంకా సెప్టెంబర్ 9న 2600 మెట్రిక్ టన్నులు, 12న 1500 మెట్రిక్ టన్నులు జిల్లాకు చేరనున్నాయని వెల్లడించారు.వ్యవసాయ శాఖ అధికారుల ఇండెంట్ ప్రకారం రైతుల పంటల అవసరాన్ని బట్టి యూరియాను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆందోళన చెందవద్దని కలెక్టర్ కోరారు.జిల్లాలోని అన్ని డీలర్లు తమ వద్ద ఉన్న యూరియాను ఎమ్మార్పీ ధరలకే రైతులకు విక్రయించాలని, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.


## మొదటి నాలుగు రోజుల్లోనే 75 శస్త్ర చికిత్సలు

### జాతీయ స్థాయి చెవి ముక్కు గొంతు నిపుణుల సేవలు




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 06-నంద్యాల మధుమణి నర్సింగ్ హోమ్‌లో మంగళవారం ప్రారంభమైన 35వ ఉచిత చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్సల శిబిరం విజయవంతంగా కొనసాగుతోంది. రోగులను ఎంపిక చేసి, అవసరమైన పరీక్షలు నిర్వహించి బుధవారం నుంచి రోజూ 15?20 శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. శనివారానికి 75 శస్త్ర చికిత్సలు పూర్తయ్యాయి.ఈ శిబిరంలో మధుమణి వైద్యులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ మణిదీప్, డాక్టర్ రోహిత్ తోపాటు దేశంలోని ప్రముఖ నిపుణులు డాక్టర్ దూబే, డాక్టర్ సంజయ్ అగర్వాల్, డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, డాక్టర్ ఆర్షద్‌హుస్సేన్, డాక్టర్ పలని అప్పన్, డాక్టర్‌నజండప్ప,డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ శ్రీపతి నాయుడు సేవలు అందిస్తున్నారు. మొత్తం 100 శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహించనున్నారు. రోజుకు 250 మందికి పైగా రోగులను ఓపిడీలో పరీక్షించి వారం రోజులపాటు ఉచిత మందులు అందిస్తున్నారు. శస్త్ర చికిత్సలు, పరీక్షలు, మందులు కలిపి రూ.50 లక్షల విలువైన సేవలు నిరుపేదలకు అందుతున్నాయని ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు.జాతీయ ముక్కు గొంతు సంఘం మాజీ అధ్యక్షులు డాక్టర్ దూబే, సైంటిఫిక్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ సంజయ్ అగర్వాల్ లను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

## జిల్లా పోలీసు శాఖకు నూతన జాగిలం హంటర్ (డాగ్.) నూతన హంటర్ జాగిలాన్ని పరిశీలించిన... - జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.



విభారె న్యూస్ సెప్టెంబరు 06 కర్నూలు జిల్లా ప్రతినిధి. మంగళగిరి పోలీసు హెడ్ క్వార్టర్స్ నుండి జిల్లా కు చేరుకున్న కొత్త డాగ్. పేలుడు పదార్థాలు గుర్తించడం లో శిక్షణ. కేసుల చేధనలో, నేరస్థులను గుర్తించడంలో జిల్లా పోలీస్ శాఖ మరింత బలోపేతం అయ్యేందుకు నూతన జాగిలం హంటర్ జిల్లా పోలీసు శాఖకు రావడం జరిగిందని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ తెలిపారు.హంటర్ అనే నూతన జాగిలం ఎపి విజయవాడ మంగళగిరి హెడ్ క్వార్టర్స్ 6 వ బెటాలియన్ లో 10 నెలల పాటు పేలుడు పదార్థాలు గుర్తించడం లో శిక్షణ పొందిందన్నారు. ఈ సంధర్బంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన నూతన జాగిలాం హంటర్ ను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు కేసుల ఛేదనలో కీలకమైన జాగిలాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. డాగ్ స్క్వాడ్ మరింత సమర్ధవంతంగా విధులు నిర్వర్తించేందుకు దోహదపడుతుందన్నారు. ఈ జాగిలనీతో మొత్తం డాగ్ స్క్వాడ్ సంఖ్య 9 కి చేరుకుందన్నారు.హంటర్ అనే జాగిలం బెల్జియం మలనాయిస్ జాతికి చెందినదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ జావేద్, డాగ్ స్వాడ్ ఇంచార్జ్ ఎఆర్ కానిస్టేబుల్ రాజు,డాగ్ హ్యాండ్లర్ ఎఆర్ కానిస్టేబుల్ శేఖర్ పాల్గొన్నారు.

## నంద్యాల మండలంలో రైతులకు యూరియా కొరతే లేదు

### మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు స్పష్టం



విభారె న్యూస్, నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 06:నంద్యాల మండల పరిధిలో ఎక్కడా యూరియా కొరత లేదని మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు స్పష్టం చేశారు. శనివారం నాడు వ్యవసాయాధికారి కార్యాలయంలో మాట్లాడిన ఆయన, మండలంలో 13 ఆర్‌బీకే కేంద్రాల ద్వారా ఇప్పటికే 765 టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేశామని తెలిపారు. అదనంగా రెండు సొసైటీ ద్వారా 485 టన్నుల యూరియా సరఫరా చేయడం జరిగింది.మండలంలో మొత్తం 7266 హెక్టార్లలో సాగు జరుగుతోందని ఆయన వివరించారు. ఇందులో 5330 హెక్టార్లలో వరి, 1026 హెక్టార్లలో మొక్కజొన్న, 180 హెక్టార్లలో మిరప, 170 హెక్టార్లలో సోయాచిక్కుడు, 140 హెక్టార్లలో మినుము సాగు చేస్తున్నారని తెలిపారు.రైతులు యూరియా కొనుగోలు చేసుకోవాలంటే తప్పనిసరిగా పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్, ఫోన్ నంబరు తీసుకెళ్లాలని సూచించారు. కౌలు రైతులైతే సీసీఆర్‌సీ కార్డు జిరాక్స్ సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. సాగు చేసే పంట, విస్తీర్ణాన్ని బట్టి ఎరువుల విక్రయాలు జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు.

## కుంభరాశి వారు జాగ్రత్త వేదపండితుడు కార్తికేయ శర్మ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 06-ఈ నెల 7వ తేదీ రాత్రి రాహు గ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం భారతదేశమంతటా కనిపించనుందని వేదపండితులు కార్తికేయ శర్మ ఒ ప్రకటన లో తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రహణ కాలములుస్పర్శ: రా.9:56, నిమిషాలకు : 10:59, మధ్య: 11:41, ఉన్మీలన: 12:22, మోక్షం: 1:26.పుణ్య కాలం : 3 గంటల 30 నిమిషాలు.ఈ గ్రహణం శతభిష, పూర్వాభాద్ర నక్షత్రాలు, కుంభరాశి వారికి దోషకరమని, అలాగే మీన, కర్కాటక, తుల, వృశ్చిక రాశులవారు కూడా జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. పరిహారాలుశాంతి, బింబదానం, జపాలు, దానాలు చేయడం అవసరమని కార్తికేయ శర్మ పేర్కొన్నారు.

## ప్రజల కలను నిజం చేస్తున్న టీడ్కో గృహాల రిజిస్ట్రేషన్

### ఉచిత రిజిస్ట్రేషన్ లబ్ధిదారుల ముఖాల్లో వెలుగులు




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 06:నంద్యాల పట్టణంలో టీడ్కో గృహాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా 15 మంది లబ్ధిదారులకు పూర్తిగా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ ? "ప్రతి పేద కుటుంబానికి తలదాచుకోడానికి స్వంత గృహం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఇల్లు కల ప్రతి ఒక్కరి జీవితంలో కీలకమైన మలుపు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియతో లబ్ధిదారుల కలలు సాకారం అవుతున్నాయి" అని తెలిపారు.లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ? "ఏళ్ల తరబడి ఇల్లు కల మాత్రమే అనిపించింది. ఇప్పుడు నిజమవుతోంది. ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయడం మాకు ఆశీర్వాదం లాంటిది" అని హర్షం వ్యక్తం చేశారు.ప్రజలు సైతం అభిప్రాయపడుతూ ? "ఇంటి కలను నిజం చేస్తున్న టీడ్కో గృహాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. పేదవాడికీ గృహ యజమాని హక్కు దక్కుతోందంటే ఇది చారిత్రాత్మకం" అని ప్రశంసించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190